సాక్షి మహబూబాబాద్

గురువారం | 29 | ఫిబ్రవరి | 2024



తల్లులకు తనివితీరా మొక్కులు

మేడారం సమ్మక్క సారలమ్మ తిరుగువారం పండుగ బుధవారం ఘనంగా జరిగింది. సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం పూజారులు తిరుగువారం నిర్వహించారు. - 8లో▸



దేవుడిలా కొలుచుకుంటున్నాం..

సంత్ సేవాలాల్‌ను దేవుడిలా కొలుస్తున్నామని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం

37.2°/17.4°

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రి కాస్త చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి



కురవి: మార్చి 3న జరిగే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎంహెచ్‌ఓ అంబరీష ఆదేశించారు. బుధవారం మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజి) సబ్ సెంటర్, బలపాల పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాల పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని, వలస వచ్చిన పిల్లలు, ఇటుక బట్టీల దగ్గర ఉండే పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని సూచించారు. అదేవిధంగా 12 వారాల లోపు గర్భిణులను నమోదు చేయాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ స్రవంతి, సీహెచ్‌ఓ కృష్ణార్జున రావు, సబ్ యూనిట్ ఆఫీసర్ వడ్డెబోయిన శ్రీనివాస్, చందు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

2న వీరభద్రస్వామి హుండీల లెక్కింపు

కురవి: మార్చి 2న మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలోని హుండీల ఆదాయాన్ని లెక్కిస్తామని ఆలయ ఈఓ సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత డిసెంబర్ 15వ తేదీ నుంచి మార్చి ఒకటో తేదీ వరకు హుండీల్లో భక్తులు సమర్పించుకున్న కానుకల ఆదాయాన్ని లెక్కిస్తామని తెలిపారు.

బహిష్కరించే హక్కు భరత్‌చందర్‌రెడ్డికి లేదు



బయ్యారం: కాంగ్రెస్ పార్టీ నుంచి ఎవరిని బహిష్కరించే హక్కు జిల్లా అధ్యక్షుడు భరత్ చందర్‌రెడ్డికి లేదని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. బుధవారం మండలంలోని గంధంపల్లి–కొత్తపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా భూక్య ప్రవీణ్‌నాయక్‌ను నియమించిన జిల్లా అధ్యక్షుడు తిరిగి బహిష్కరించడం సరికాదన్నారు. పార్టీలో చేర్చుకునే హక్కు మాత్రమే ఉంటుందని, తొలగించే హక్కు జిల్లా అధ్యక్షుడికి ఉండదన్నారు. స్థానిక ఎమ్మెల్యేనైనా తనను సంప్రదించకుండా పదవులు ఇవ్వడం భరత్‌చందర్ రెడ్డి తప్పిదమేనన్నారు. ఆయన బయటకు పంపిన వారందరినీ తిరిగి పార్టీలోకి తీసుకునేందుకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. ప్రవీణ్‌నాయక్ తన పదవిలో కొనసాగుతారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఎమ్మార్సీ సిబ్బందికి షోకాజ్ నోటీస్‌లు

తొర్రూరు: విధులకు ఎగనామం పెట్టిన స్థానిక విద్యా వనరుల కేంద్రం(ఎమ్మార్సీ) సిబ్బందికి జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచి షోకాజ్ నోటీస్‌లు అందాయి. 'సిబ్బంది దుమ్మా... ఎమ్మార్సీ ఆఫీస్‌కు తాళం' శీర్షికన బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన విద్యాశాఖ అధికారులు ఐదుగురు ఎమ్మార్సీ సిబ్బందికి షోకాజ్ నోటీసులు అందించారు. డీఈఓ రామారావు స్థానిక ఎమ్మార్సీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన క్రమంలో తాళం వేసి ఉంది. ఈమేరకు డీఈఓ సిబ్బంది వివరణ కోరుతూ షోకాజ్ నోటీస్‌లు జారీ చేశారు. కంప్యూటర్ ఆపరేటర్ వి.మల్లేశం, ఎంఐఎస్ కోఆర్డినేటర్ జి. వరలక్ష్మి, ఐఈఆర్పీలు జి. అనిల్, డి. ఇందిర, ఆఫీస్ సబార్డినేట్ బి. రవిలకు షోకాజ్ నోటీస్‌లు జారీ అయ్యాయి. విధులకు దుమ్మా కొట్టడంపై రెండు రోజుల్లో లిఖిత పూర్వకంగా వివరణ ఇవ్వాలని, ఒక రోజు వేతనం కట్ చేస్తామని డీఈఓ నోటీస్‌లో పేర్కొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయించొద్దు

బయ్యారం: రైతులకు నకిలీ విత్తనాలు, పురుగు మందు, ఎరువులు విక్రయించొద్దని జిల్లా వ్యవసాయశాఖాధికారి కె.అభిమన్యుడు అన్నారు. మండలంలోని బయ్యారం, గంధంపల్లి–కొత్తపేటలోని విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల షాపులను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు విక్రయించాలని లేని ఎడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. షాపుల్లో తప్పనిసరిగా అన్ని రకాల రిజిస్టర్లలో ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ రాంజీ పాల్గొన్నారు.

మధుర జ్ఞాపకం!



ఫిబ్రవరి 29.. నాలుగేళ్లకోసారి వేడుక
2024.. లీప్ సంవత్సరం

- మాకో తీపి గుర్తు అంటున్న పెళ్లి రోజు జంటలు
- పుట్టిన రోజును ఆనందంగా చేసుకుంటామంటున్న మరికొందరు
- నేడు శుభముహూర్తాన పెళ్లి చేసుకుంటున్న ఇంకొన్ని జంటలు

పెళ్లంటే నూరేళ్ల పంట. ఏడడుగులు.. మూడు ముళ్ల బంధంతో ఒక్కటైన దంపతులు.. ఏటా పెళ్లి రోజు జరుపుకుంటూ.. మధుర జ్ఞాపకాలను పదిల పరుచుకుంటారు. అదే లీప్ సంవత్సరంలో వివాహం చేసుకున్న జంటలు.. నాలుగేళ్లకోసారి వివాహ వేడుకలను జరుపుకోవాల్సి ఉంటుంది. అదేవిధంగా పుట్టిన రోజు. మనం అమ్మ కడుపులోనుంచి బయటి ప్రపంచానికి వచ్చిన శుభదినం. ఆ రోజును ప్రతిఏటా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్నేహితులతో కలిసి చేసుకుంటుంటాం. కానీ ఫిబ్రవరి 29న పుట్టేవారు నాలుగేళ్లకోసారి జన్మదిన వేడుకలు జరుపుకోవాలి. ప్రతి ఏటా జరుపుకోలేదని బాధ ఉన్నా.. లీప్ సంవత్సరంలో అంతా కలిసి పండుగలా చేసుకుంటామని చెబుతున్నారు. నవ జంటలు నేడు ఒక్కటి కానున్నాయి. గురువారం శుభముహూర్తాన వివాహం జరుపుకోనున్నాయి. నేడు (ఫిబ్రవరి 29 – లీప్ సంవత్సరం) రోజున ఉమ్మడి జిల్లాలో పుట్టిన రోజు, పెళ్లి రోజు, వివాహాలు జరుపుకుంటున్న వారిపై సాక్షి ప్రత్యేక కథనాలు..

బర్త్‌డే

గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకుంటాం..



నర్సంపేట: నాలుగు సంవత్సరాలకు ఒకసారి మాత్రమే వచ్చే ఫిబ్రవరి 29 లీప్ సంవత్సరంలో మా చిన్న కుమారుడు హర్షవర్ధన్ పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడం మాకు ప్రత్యేకం. నాలుగేళ్లకోసారి అని కొంతబాధగా ఉంటుంది. అయినా గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకుంటాం.

– అదుప స్రవంతి–శ్రీకాంత్

పండగే పండుగ...



జనగామ: నాలుగేళ్ల సంబురం అంటే మజాకానా... కుటుంబ సభ్యులు, చుట్టాలు, స్నేహితులతో కలిసి రోజంతా జరుపుకునే వేడుక. నాలుగు దశాబ్దాల వయసులో కేవలం 10 సార్లు మాత్రమే జన్మదిన వేడుకలను జరుపుకున్న. లీప్ సంవత్సరం బర్త్‌డే రావడం పూర్వ జన్మసుకృతంగా భావిస్తా.

– కొయ్యడ సుమన్, లింగాలఘణపురం

నా జీవితంలో స్పెషల్ డే..



జనగామ: లీప్ సంవత్సరంలో జన్మించడం.. నా జీవితంలో స్పెషల్ డేగా భావిస్తున్నా. రెండు దశాబ్దాల జీవిత కాలంలో 5వ సారి జన్మదిన వేడుకలను జరుపుకుంటున్న. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులకు స్పెషల్ అతిథిని. హేమంత్... హ్యాపీ బర్త్‌డే అంటూ చెప్పే ఒక్కొక్కరి ఆప్యాయతలను.. వచ్చే లీప్ సంవత్సరం వరకు గుర్తుకు పెట్టుకుంటా.

– దరావత్ విశాల్ హేమంత్, కన్నెబోయినగూడెం, నర్మెట

నాలుగేళ్లకు మొదటి పుట్టినరోజు వేడుక



బయ్యారం: ఏడాదికోసారి జరుపుకునే పుట్టినరోజు నాలుగేళ్లకు జరుపుకుంటే ఆ అనుభూతి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. మండలంలోని ఇర్సులాపురం గ్రామానికి చెందిన కాశమల్ల సురేందర్–ఉష దంపతులకు 2020 ఫిబ్రవరి 29న మొదటి సంతానం లోలాక్షి సురేందర్ జన్మించింది. అయితే లీప్ సంవత్సరంలో పుట్టడంతో ఆమె పుట్టినరోజు ఇంత వరకు జరపలేదు. కాగా నాలుగేళ్ల తర్వాత గురువారం తమ బిడ్డ పుట్టిన రోజు వేడుకలను అంగరంగ వైభవంగా జరపనున్నారు. ఈమేరకు ప్లాన్ చేశామని, ఎంతో థ్రిల్‌గా ఎదురుచూస్తున్నాని చెప్పారు.

– కుమార్తె, కుమారుడితో సురేందర్ దంపతులు

నాకు అతి పెద్ద పండుగ



రామన్నపేట : నాలుగు సంవత్సరాలకోసారి జరుపుకునే జన్మదిన వేడుక నా జీవితంలో అతి పెద్ద పండుగ. నా భర్తను 25 సంవత్సరాల క్రితం మావోయిస్టులు మిస్ ఫైర్ చేసి చంపేశారు. పిల్లలు సైతం లేకపోవడంతో స్నేహితులు, నేను ఉద్యోగం చేసే డైక్ కేంద్రంలో విద్యార్థులే జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. జీవితంలో అన్ని కోల్పోయినా నాకు ఇలా నిర్వహించే పుట్టిన రోజు వేడుకలు ఆనందాన్ని కలిగిస్తాయి.

– తనూజ

లీప్ ఇయర్ కోసం ఎదురుచూస్తుంటా..



తరిగొప్పుల: అందరిలా ప్రతి సంవత్సరం పుట్టిన రోజు జరుపుకోవడం కుదరదు. కాబట్టి లీప్ ఇయర్ కోసం ఎదురుచూస్తుంటా. ఈ రోజు నాకు ప్రత్యేకమైనది. మా తల్లిదండ్రులు కొండ్ర వెంకటేష్, లావణ్య, అన్నయ్య మారుతితో పాటు బంధువుల సమక్షంలో జన్మదిన వేడుకలు జరుపుకుంటా.

– కొండ్ర రసన్య, పోతారం

బంధుమిత్రుల మధ్య వేడుకలు..



నర్మెట: మాకు 29–02–2012 సంవత్సరంలో మా పాప మ్యాగి జన్మించింది. నాలుగేళ్లకు ఒకసారి పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించడం ఎంతో సంతోషాన్నిస్తుంది. బంధుమిత్రులను ఆహ్వానించడంతో పాటు బాల సదనం, వృద్ధాశ్రమాలు, వితంతువులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేసి అందరితో కలిసి వేడుకలను ఘనంగా నిర్వహించుకుంటాం. లీప్ ఇయర్ బర్త్‌డే జరుపుకోవడంలో ఎంతో ప్రత్యేకమైన అనుభూతిని పొందుతాం.

– ఏర్పుల చైతన్య హెల్త్‌వైజర్, ఎంపీటీసీ, ఆగపేట, నర్మెట

పెళ్లి రోజు వేడుకలు

20 ఏళ్లలో ఐదో పెళ్లి రోజు..



టేకుమట్ల: 2004, ఫిబ్రవరి 29న మా వివాహం జరిగింది. 20 సంవత్సరాల్లో రేపటి పెళ్లిరోజు ఐదవది. నాలుగు సంవత్సరాలకు ఒకసారి పెళ్లి రోజు వేడుకలు జరుపుకోవడం మాకొక ప్రత్యేకం. మా పెళ్లికి ముందు నా భార్య సరిత ఫిబ్రవరి 29 లీప్ సంవత్సరం రోజున పెళ్లి వద్దని వారించింది. అదే ప్రత్యేకమైన రోజు అని నచ్చజెప్పిన. దాంతో ఆమె కూడా సరేనంది. నాలుగేళ్లకోసారి పెళ్లి రోజు వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉంది. ప్రతిసారి పెళ్లి రోజు వేడుకలు ఇంట్లోనే కుటుంబ సభ్యులు, మిత్రుల సమక్షంలో జరుపుకుంటున్నాం..

– జొన్నల శంకర్

ముహూర్తం కుదిరిన వేళ..

అరుదైన సందర్భమిది..



గీసుకొండ: నేడు నా పెళ్లి. లీప్ ఇయర్‌లో నాపెళ్లి జరుగుతుండటం చాలా సంతోషంగా ఉంది. ఇలాంటి అరుదైన సందర్భం కొద్దిమందికే వస్తుంది. నాలుగేళ్లకు ఒకసారి పెళ్లిరోజు జరుపుకుంటామని తెలిసి థ్రిల్ అవుతున్నాను. మా తల్లిదండ్రులు పురోహితులు నిర్ణయించిన ముహూర్తానికి మా పెళ్లి చేస్తుండటం, అది లీప్ ఇయర్ కావడం స్పెషల్‌గా అనిపిస్తుంది.

– నవదంపతులు ఇంద్రజ–రాజేశ్‌కుమార్

ఇదో.. మధురస్మృతి



సంగెం: పెళ్లిరోజు మధురజ్ఞాపకంగా ఉండాలని ఫిబ్రవరి 29న ముహూర్తం నిర్ణయించాం. మా జాతకం ప్రకారం పురోహితులు ఫిబ్రవరి 15, 29, మార్చి 10తేదీలు సూచించారు. పెళ్లిరోజు మధుర స్మృతిగా నిలిపోయేలా 29ని ఎంచుకున్నాం.

– కందకట్ల ప్రణయ్, లక్ష్మీపద్మజ

అందరిలో భిన్నంగా ఉండాలని..



సంగెం: అందరిలో భిన్నంగా ఉండాలని లీప్ సంవత్సరం ఫిబ్రవరి 29న పెళ్లి చేసుకోవాలని నిశ్చయించుకున్నాం. ప్రతిఏడాది పెళ్లిరోజు జరుపుకోవడం సాధారణం.. మూడు ముళ్ల బంధంతో ఒక్కటయ్యే మేము నాలుగేళ్లకోసారి వేడుకలు జరుపుకునే అరుదైన అవకాశం లభించింది.

– శిరీష– గణేష్‌రెడ్డి, గవిచర్ల, సంగెం మండలం

డబుల్ ధమాకా..



జనగామ: జనగామ మండలం పసరమడ్ల గ్రామానికి చెందిన సుధగాని నవీన్ కుమార్ గౌడ్, హనుమకొండకు చెందిన మార్క హారిక నేడు వివాహం చేసుకుని.. చరిత్రలో వారికంటూ ఓ రోజు ఉండాలని నిశ్చయించుకున్నారు. నవీన్ కుమార్ ఆస్ట్రేలియాలో ఐటీ సెక్టార్‌లో ఉద్యోగం చేస్తుండగా.. పెళ్లి కోసం ఇండియాకు వచ్చారు. నాలుగేళ్ల కోసారి పెళ్లి రోజు జరుపుకోవాలని ముందుగా ఇద్దరు ఆలోచన చేసినా... ఏకాభిప్రాయంతో కుటుంబ సభ్యులు ఓకే చెప్పారు. ఇంకేముంది పురోహితుడు పెళ్లికి ముహూర్తం పెట్టారు. నేడు పెళ్లి జరగనుంది. 14న వాలంటైన్స్‌డే సందర్భంగా ఎంగేజ్‌మెంట్ జరుపుకున్నారు.

నాకు ప్రత్యేకమైన రోజు...



విద్యార్థులతో ఉపాధ్యాయుడు ప్రభుదాస్(ఫైల్)

డోర్నకల్:2008 ఫిబ్రవరి 29న ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా బాధ్యతలు స్వీకరించా. డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగానికి ఎంపికైన తర్వాత ఫిబ్రవరి 29న డోర్నకల్ ఎంఈఓ కార్యాలయంలో రిపోర్ట్ చేసి అదే రోజు మండలంలోని తెల్లబండతండా ప్రభుత్వ పాఠశాలలో బాధ్యతలు చేపట్టా. నాలుగేళ్లకోసారి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సెలబ్రేట్ చేసుకుంటా.

– డి.ప్రభుదాస్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, డోర్నకల్

విద్యార్థులు పరీక్షల భయం వీడాలి

- డీఈఓ రామారావు

చిన్నగూడూరు: పదో తరగతి విద్యార్థులు భయం వీడి ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈఓ రామారావు అన్నారు. బుధవారం మండలంలోని జయ్యారం ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు చేసి పరీక్షలపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు ఉషశ్రీతో కలిసి పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులకు పదో తరగతి కీలకమన్నారు. విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తేజోన్నతరెడ్డి, ఉపేందర్, ఫిరోజ్, రామ్మోహన్‌రెడ్డి, కిషన్, నవీన్, రహీమున్నీసా తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఫలితాలు సాధించాలి




విద్యార్థులకు సూచనలు ఇస్తున్న డీఈఓ

కురవి: పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించాలని డీఈఓ రామారావు అన్నారు. బుధవారం మండలంలోని నేరడ గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. ఉపాధ్యాయులతో మాట్లాడారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదవాలని సూచించారు. ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌సీ సంతోష్, పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం కె.సాయిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మరోసారి మోదీ ప్రభుత్వాన్ని గెలిపించాలి

- బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు
- మానుకోటకు చేరుకున్న విజయసంకల్ప యాత్ర



మాట్లాడుతున్న మార్తినేని ధర్మారావు

మహబూబాబాద్ అర్బన్: మరోసారి మోదీ ప్రభుత్వాన్ని గెలిపించాలని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు అన్నారు. బీజేపీ చేపట్టిన విజయసంకల్ప యాత్ర మానుకోటకు బుధవారం రాత్రి చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మార్తినేని ధర్మారావు, బీజేపీ నాయకులు ముందుగా సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ధర్మారావు మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మానుకోటలో కాషాయం జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. దేశంలో కాంగ్రెస్ పాలనలో పేదరికం తాండవించిందని, మోదీ పాలనలో భారత్ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిదన్నారు. గిరిజనులు, ఆదివాసీల విద్యాభివృద్ధి కోసం గిరిజన యూనివర్సిటీ తీసుకొచ్చామన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలను బొందపెట్టాలని, తెలంగాణలో 17సీట్లు బీజేపీ గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీలో పలువురు చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, యాత్ర ప్రముఖ్ ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, పార్లమెంట్ ప్రభారి వెంకటనారాయణరెడ్డి, నాయకులు రాజవర్ధన్‌రెడ్డి, సీతయ్య, కొమురయ్య, పీరయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సతీష్, అసెంబ్లీ కన్వీనర్ కోమల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు షురూ..



నిమిషం ఆలస్యంతో పరీక్షకు అనుమతించని అధికారులు

- 4,631 మంది విద్యార్థులు హాజరు, 362 మంది గైర్హాజరు
- సెంటర్లను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్, డీఐఈఓ



పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు







పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్ డేవిడ్, ఆలస్యంగా వచ్చి గేటువద్ద నిరీక్షిస్తున్న విద్యార్థులు, కేంద్రానికి పరుగుపెడుతున్న విద్యార్థి

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ప్రథమ సంవత్సరం తెలుగు, ఉర్దూ, హిందీ, సంస్కృతం పరీక్షలకు 3,601మంది విద్యార్థులకు 3,449మంది హాజరై.. 152 మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్ విద్యార్థులు 1,334మందికి గానూ 1,182 మంది హాజరుకాగా 152మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

విద్యార్థుల ఆలస్యం..

మానుకోట పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రానికి ముగ్గురు విద్యార్థులు ఆలస్యంగా రాగా.. వారిని అనుమతించలేదు. బతిమిలాడినా పరీక్ష కేంద్రంలోకి పంపలేదు. దీంతో విద్యార్థులు కన్నీటితో వెనుదిరిగారు.

కేంద్రాల తనిఖీ..

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని అదనపు కలెక్టర్ డేవిడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థులు పరీక్ష రాస్తున్న తీరు, వారి ప్రశ్న, జవాబు పత్రాలను పరిశీలించారు. కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు గురించి అడిగి తెలుసుకున్నారు. డీఐఈఓ సమ్మెట సత్యనారాయణ పలు ప్రైవేట్, ప్రభుత్వ కళాశాలలను తనిఖీలు చేసి ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షల్లో ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా చూడాలని సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్స్‌కు సూచించారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతించొద్దని అన్నారు. అదేవిధంగా విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు.

వైద్యశిబిరాలు...

జిల్లావ్యాప్తంగా ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు అస్వస్థతకు గురైతే వెంటనే స్పందించేందుకు వీలుగా వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలను అందుబాటులో ఉంచారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మందులు సిద్ధంగా ఉంచారు.

సౌకర్యాలు లేక విద్యార్థుల ఇబ్బందులు

అసౌకర్యాల నడుమ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాల్లో గాలి, వెలుతురు, ఫర్నిచర్ కచ్చితంగా ఉండాలని అధికారులు పదే పదే ఆదేశించినా కళాశాలల యాజమాన్యాలు పట్టించుకోలేదు. కొన్ని కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం లేకపోవడతో విద్యార్థులు ఉక్కపోత, వెలుతురు రాక ఇబ్బందులు పడ్డారు. మరికొన్ని చోట్ల డబుల్ డెస్క్ బెంచీలు లేకపోవడంతో విద్యార్థులు కాళ్ల మీద ప్యాడ్‌లు పెట్టుకొని పరీక్ష రాశారు. కాగా పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు చాలావరకు పని చేయలేదు.

వ్యాపారులు సహకరించాలి

మహబూబాబాద్: కూరగాయల వ్యాపారులు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి కోరారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో వ్యాపారుల ఎంపిక కోసం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. వ్యాపారుల కోరిక మేరకు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించామని, అందుకు సంబంధిత వ్యాపారులు అర్థం చేసుకొని ఎంపికలో సహకరించాలన్నారు. అనంతరం వ్యాపారులతో కలిసి మార్కెట్‌ను సందర్శించారు. కమిషనర్ నోముల రవీందర్, డీఈ ఉపేందర్, మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిషోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

పరీక్ష కోసం వెళ్తూ... పరలోకానికి..

● రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం


అఖిల్ (ఫైల్)

కురవి: ఓపెన్ డిగ్రీ పరీక్ష కోసం హాజరయ్యేందుకు స్నేహితుడితో కలిసి బైక్‌పై వెళ్తుండగా వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న రెయిలింగ్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ విద్యార్థి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటన బుధవారం కురవి మండలం అయ్యగారిపల్లి శివారులోని 365 జాతీయ రహదారిపై జరిగింది. కురవి ఎస్సై బి.గోపి కథనం ప్రకారం.. మరిపెడ మండలంలోని ఆనేపురం శివారు వెంకట్యాతండా జీపీకి చెందిన గుగులోత్ అఖిల్(22) మహబూబాబాద్‌లో ఓపెన్ డిగ్రీ పరీక్షకు హాజరయ్యేందుకు తన బంధువు గుగులోత్ అశోక్‌తో కలిసి ద్విచక్రవాహనంపై మరిపెడ నుంచి మానుకోటకు వస్తున్నాడు. ఈ క్రమంలో బైక్ అదుపు తప్పి అయ్యగారిపల్లి శివారులోని 365 జాతీయ రహదారి పక్కన ఉన్న రెయిలింగ్‌ను ఢీకొంది. దీంతో అఖిల్ అక్కడికక్కడే దుర్మరణం చెందగా అశోక్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటనపై మృతుడి తండ్రి టాకిరియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందజేసినట్లు ఎస్సై గోపి తెలిపారు. కాగా, ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో కుటుంబంలో విషాదం అలుముకుంది.

నేటి నుంచి మేడారం హుండీల లెక్కింపు

హన్మకొండ కల్చరల్ : మేడారం మహాజాతరలో ఏర్పాటు చేసిన హుండీలను నేటి నుంచి లెక్కిస్తామని దేవాదాయధర్మాదాయశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 8గంటలకు హనుమకొండ లష్కర్ బజార్‌లోని టీటీడీ కల్యాణమండపంలో వివిధ శాఖ అధికారుల సమక్షంలో లెక్కింపు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. మేడారం జాతర ఈఓ రాజేంద్రం మాట్లాడుతూ జాతరలో మొత్తం 512 హుండీలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆ హుండీలను మేడారం నుంచి హనుమకొండలోని టీటీడీ కల్యాణమండపానికి తరలించామన్నారు. అలాగే, మరికొన్ని హుండీలను కూడా ఏర్పాటు చేశామని, తిరుగువారం పండుగ అనంతరం వాటి లెక్కింపు చేపడుతామని తెలిపారు.



తల్లులకు తనివితీరా మొక్కులు


అమ్మవార్లను దర్శించుకుంటున్న భక్తులు


సమ్మక్క గుడికి వస్తున్న జగ్గారావు కుటుంబీకులు

ఘనంగా తిరుగువారం పండుగ

● మేడారం, కన్నెపల్లి ఆలయాల్లో ప్రత్యేక పూజలు
● ముగిసిన వనదేవతల పూజా కార్యక్రమాలు

ఎస్ఎస్ తాడ్వాయి : మేడారం సమ్మక్క, సారలమ్మ తిరుగువారం పండుగ బుధవారం ఘనంగా జరిగింది. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం పూజారులు తిరుగువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేడారంలోని సమ్మక్క గుడి, కన్నెపల్లిలోని సారలమ్మ గుడిని శుద్ధి చేశారు. సమ్మక్క గుడిలో అమ్మవారి శక్తి పీఠం గద్దెను ప్రధాన వడ్డె కొక్కెర క్రిష్ణయ్య అలికారు. ఆడపడుచులు శక్తి పీఠం గద్దెను పసుపు, కుంకుమ, తీరొక్క రంగులతో అలంకరించారు. గుమ్మాల వద్ద ముగ్గులు వేసి శక్తి పీఠం గద్దెపై కంకణాలు ఉంచారు. అనంతరం సమ్మక్క పూజారులు అమ్మవారి గద్దె పై శక్తి పీఠాన్ని ఉంచి ధూపదీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. గుడి ఎదుట ధ్వజ స్తంభం వద్ద యాటకు జడ్డ పట్టి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం పూజారులు చిలుకలగుట్టకు వెళ్లి అక్కడ కూడా మరొసారి రహస్య పూజలు నిర్వహించారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని మొక్కుకున్నారు. కన్నెపల్లిలోని సారలమ్మ గుడిలో ఆడపడుచులు అమ్మవారి వడేరాల కుండలను పసుపు, కుంకుమలతో అలంకరించారు. అనంతరం ప్రధాన పూజారి కాక సారయ్య, పూజారులు కలిసి అమ్మవారి ధూపదీపాలు వెలిగించి యాటను నైవేద్యంగా సమర్పించారు. ఈ తిరుగువారం పండుగతో వనదేవతల పూజా కార్యక్రమాలు ముగిశాయి.

పూజారులు మొక్కులు

మేడారం, కన్నెపల్లిలో అమ్మవార్ల తిరుగువారం పండుగ సందర్భంగా పూజారుల కుటుంబీకులు, స్థానిక ఆదివాసీలు, గ్రామస్తులు మొక్కులు చెల్లించుకున్నారు. మేడారంలోని సమ్మక్క గుడికి పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు కుటుంబ సమేతంగా చీరసారె, ఒడి బియ్యం, పసుపు, కుంకుమ, యాటలను తీసుకొని గుడికి వచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కన్నెపల్లిలోని సారలమ్మ గుడి వద్ద కూడా సారలమ్మ పూజారులు, స్థానిక ఆదివాసీలు, గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఏడాది శుభం కలగాలని, ప్రజలు సుఖసంతోషాలు, పాడి పంటలతో బాగుండాలని కోరుకున్నారు. కాగా, మహాజాతరకు పూజారులు, గ్రామస్తులు తమ బంధువులను ఆహ్వానించారు. తిరుగువారం పండుగ రోజు ఆడపడుచులకు చీరసారె, కానుకలు అందించి సాగనంపారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న సమ్మక్క పూజారులు, అమ్మవారికి యాటను మొక్కుతూ..

వనదేవతలకు మంత్రి సీతక్క మొక్కులు


సమ్మక్క గద్దె వద్ద మొక్కులు చెల్లిస్తున్న మంత్రి సీతక్క

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క, సారలమ్మను మంత్రి సీతక్క దర్శించుకున్నారు. బుధవారం తిరుగువారం పండుగ సందర్భంగా అమ్మవార్లను దర్శించుకుని ఎత్తుబంగారం, చీరసారె, కానుకలు సమర్పించారు. పగిడిద్దరాజు, గోవిందరాజులుకు పూజలు చేశారు. అనంతరం మేడారంలోని పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. ఆమె వెంట డీపీఓ వెంకయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు రేగ కల్యాణి, ఏటూరునాగారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ సృజన పాల్గొన్నారు.

పూనుగొండ్లలోని పగిడిద్దరాజు ఆలయంలో..

గంగారం : గంగారం మండలం పూనుగొండ్ల గ్రామంలోని పగిడిద్దరాజు ఆలయంలో బుధవారం తిరుగువారం జాతర ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభించారు. రాత్రి ప్రధాన అర్చకులు పెనక వంశీయులు వనాన్ని తీసుకొచ్చి గద్దెపై ప్రతిష్ఠించారు. మూడురోజుల పాటు నిర్వహించే ఈ జాతరకు భక్తులు భారీ సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకుంటారు. కాగా, పగిడిద్దరాజు జాతర సందర్భంగా వాలీబాల్ క్రీడలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన పూజారులు పెనక రాజేశ్వర్, సురేందర్, బుచ్చిరాములు, పురుషోత్తం, రామస్వామి, రాహుల్ పాల్గొన్నారు.


ఆలయంలో తోరణాలు కడుతున్న మహిళలు

ఇచ్చిన హామీల అమలెప్పుడు?


భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో సాగిన యాత్రలో అభివాదం చేస్తున్న బండి సంజయ్

● గట్టిగా అడిగితే కోడిగుడ్లతో దాడి చేస్తారా
● పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి మరో అవకాశం కల్పించాలి
● ప్రజాహిత యాత్రలో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్

ఎల్కతుర్తి: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఎప్పుడు అమలు చేస్తారని అడిగితే తనపై కోడిగుడ్లతో దాడి చేస్తారా అని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ప్రశ్నించారు. బుధవారం భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి గట్లనర్సింగాపూర్, వంగర, ముల్కనూర్ మీదుగా ఎల్కతుర్తి మండలంలోని గోపాల్‌పూర్, దామెర, చింతలపల్లి, ఎల్కతుర్తి, దండేపల్లి గ్రామాల్లో యాత్ర కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల జరిగిన సభల్లో బండి సంజయ్ మాట్లాడుతూ ప్రజా సమస్యల కోసం పోరాడితే తనపై వంద కేసులు పెట్టారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. ఇంకో నాలుగు రోజులైతే ఎన్నికల కోడ్ వస్తది.. ఇక హామీలను ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలన్నారు. నేడు రాష్ట్రంలో 90లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉంటే అందులో 50లక్షలు మహిళల పేరుమీద ఉన్నాయన్నారు. ఒక్క మహిళలకు మాత్రమే 500 వర్తిస్తదట.. మిగతావారికి వర్తించదట అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు రూ.5లక్షల కోట్లు అప్పు చేస్తే కాంగ్రెసోళ్లు రూ.10లక్షల కోట్లు అప్పు చేశారని మండిపడ్డారు. రేషన్‌కార్డు ఉన్నవారికే 200యూనిట్ల కరెంట్ ఫ్రీ అంటున్నారని, ఇప్పటి వరకు కొత్త రేషన్‌కార్డులే ఇయ్యలేదని విమర్శించారు. ఆరు గ్యారంటీల అమలు ఉత్తదే అని మండిపడ్డారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి..

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మరోసారి బీజేపీకి అవకాశం కల్పించి ఆశీర్వదించాలని బండి సంజయ్ కోరారు. కరీంనగర్–జగిత్యాల రోడ్డు, ఎల్కతుర్తి–సిద్దిపేట రోడ్డు చేయించింది తానే అని అన్నారు. కేంద్రప్రభుత్వం మంజూరు చేసిన నిధులను చదివి వినిపించారు. కరోనా సమయంలో వ్యాక్సిన్, రేషన్ బియ్యం ఉచితంగా అందజేసింది కేవలం మోదీ ప్రభుత్వమే అన్నారు. ప్రజలు సంతోషంగా ఉండాలని కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావాలని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొమటిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి, నాయకులు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, కుడితాటి చిరంజీవి, పృథ్వీరాజ్, దొంగల కొమురయ్య, ఐత సాయి, రోములు భిక్షపతి, అంబీర్ కవిత, వేణు, జనగానీ కిష్టయ్య, పెరుగు మధుకర్, వెంకటరమణ, కంచర్ల శంకరయ్య, ముష్కె వెంకటేష్, చిదురాల వెంకటేష్, పల్లెపాటి మధుకర్, సాంబశివరెడ్డి, రాజు, కరుణాకర్, కోటి, నార్లగిరి వెంకటేష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

వంగరలో పీవీకి నివాళి


పీవీ విగ్రహం పాదాల వద్ద నివాళులర్పిస్తున్న బండి సంజయ్

యాత్ర వంగర గ్రామానికి చేరుకున్నాక పీవీ విగ్రహానికి బండి సంజయ్ పూల మాల వేసి నివాళులర్పించారు. ప్రధాని నరేంద్రమోదీ తెలంగాణ వ్యక్తిగా గుర్తించి పీవీకి భారతరత్న ప్రకటించడం హర్షణీయమన్నారు. పీవీ చనిపోయినప్పుడు కాంగ్రెస్ పార్టీ కనీసం అంత్యక్రియలు జరపకుండా అడుగడుగునా అవమానపర్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆయనను ఎందుకు అవమాన పర్చిందో ఇప్పటికీ అర్థం కాలేదన్నారు. మొన్నటి వరకు అధికారంలో కొనసాగిన బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ తీరు అందితే జుట్టు అందకపోతే కాళ్లు అన్న చందంగా తయారైందని విమర్శించారు. కేసీఆర్‌కు ఎన్నికలు వస్తే మహనీయుల జయంతి, వర్ధంతి గుర్తుకు వస్తది.. ఎన్నికలు అయిపోతే ఇవేవీ గుర్తుకు రావని ఎద్దేవా చేశారు.

సైన్స్‌తోనే మానవ జీవన గమనం

● కేయూ వీసీ తాటికొండ రమేష్


మాట్లాడుతున్న వీసీ రమేష్

కేయూ క్యాంపస్: సైన్స్‌తోనే మానవ జీవన గమనమని కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ తాటికొండ రమేష్ అన్నారు. 'జాతీయ సైన్స్ దినోత్సవం' సందర్భంగా విశ్వవిద్యాలయ సెనెట్ హాల్‌లో రిజిస్ట్రార్ మల్లారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఉపన్యాస కార్యక్రమంలో 'రీసెర్చ్, ఇంక్వైరీ అండ్ సైంటిఫిక్ టెంపర్' అనే అంశంపై వీసీ మాట్లాడారు. సైన్స్, మానవ నాగరికతకు సంబంధం ఉందన్నారు. సైన్స్ ఫలితాలు ఎన్నో వైఫల్యాల తరువాత బయటకు వస్తాయన్నారు. ప్రతి పనిలో ఆటుపోట్లు ఉంటాయన్నారు. నిరంతర ఘర్షణ, విశ్వాసంతోనే సైన్స్ అని, సైన్స్‌కు సమాజానికి సంబంధించిందన్నారు. అనంతరం విజ్ఞాన దర్శిని వ్యవస్థాపకుడు, సైన్స్ ప్రచారకుడు టి.రమేష్ మాట్లాడుతూ సైన్స్ తోనే మానవ విజ్ఞానం, ప్రగతి అన్నారు. అంతర్జాతీయ పరిశోధనల కోసం భారతదేశం ఎదురుచూస్తుందన్నారు. అనంతరం రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి మాట్లాడుతూ సైన్స్ డే కేవలం సైన్స్ విద్యార్థులకు మాత్రమే పరిమితం కాదని, అన్ని సబ్జెక్టులకూ వర్తిస్తుందన్నారు. కాగా, ఈ కార్యక్రమంలో రమేష్.. పలువురు బోధన సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు సందేహాలు నివృత్తి చేశారు.

వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య


శైలజ మృతదేహం

బయ్యారం: వరకట్న పిశాచానికి ఓ వివాహిత బలైంది. కట్నం తీసుకొస్తేనే తన వద్దకు రావాలని భర్త హుకుం జారీ చేయగా.. ఆ మాటలు తల్లిదండ్రులకు చెప్పి వారికి భారం కావొద్దనే ఉద్దేశంతో ఓ వివాహిత వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాదకర ఘటన బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని గంధంపల్లి–కొత్తపేటకు చెందిన కేశగాని అప్పయ్య, రేణుక దంపతులకు ఇద్దరు కుమార్తెలు సంతానం. వీరిలో పెద్దకుమార్తె శైలజ(27)ను సంవత్సరం క్రితం మహబూబాబాద్ మండలం అనంతారం గ్రామానికి చెందిన గారెపాటి సంతోష్‌రెడ్డి ఇష్టపడి కులాంతర వివాహం చేసుకున్నారు. వీరికాపురం కొంతకాలం సవ్యంగా సాగింది. కుటుంబ పోషణ నిమిత్తం వీరు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో కట్నం తీసుకురావాలని సంతోష్‌రెడ్డి కొంతకాలంగా శైలజను వేధిస్తున్నాడు. ఇటీవల కుటుంబసభ్యులతో కలిసి తిరుపతికి వెళ్లిన సంతోష్ రెడ్డి.. తిరుగుప్రయాణంలో శైలజను హైదరాబాద్ తీసుకెళ్లకుండా పుట్టింటికి పంపించాడు. అప్పటి నుంచి మనస్తాపానికి గురైన శైలజ ఇంట్లో ఎవరూ లేని సమయంలో వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ..


రాజశ్రీనివాస్(ఫైల్)

నడికూడ: మనస్తాపంతో వాగులో దూకి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా నడికూడ మండలం కంఠాత్మకూర్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మేడిపెల్లి రాజశ్రీనివాస్(49) ఈ నెల 26వ తేదీన కుటుంబ విషయంలో తన భార్యతో గొడవ పడ్డాడు. అనంతరం మనస్తాపం చెందిన ఆయన.. అదే రోజు గ్రామ శివారులోని వాగులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం వాగు నీటిపై మృతదేహం కనిపించగా స్థానికులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు కౌశిక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కొంక అశోక్ తెలిపారు.

మార్కెట్ కమిటీలు లక్ష్యం చేరుకోవాలి

● ఆర్‌జేడీఎం మల్లేశం


మాట్లాడుతున్న ఆర్‌జేడీఎం మల్లేశం

కేసముద్రం: వార్షిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో మార్కెట్ కమిటీలకు కేటాయించిన లక్ష్యాలను చేరుకోవాలని ఆర్‌జేడీఎం మల్లేశం అన్నారు. కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 17 మార్కెట్ కమిటీలకు సంబంధించిన బడ్జెట్‌పై పరిశీలన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీఎం మల్లేశం మాట్లాడుతూ అధికారులు నిబద్ధతతో పనిచేసి టార్గెట్ పూర్తి చేయాలన్నారు. 2024–25 బడ్జెట్‌కు ప్రతిపాదనలు తయారు చేసి, ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డీడీఎం అజ్మీరా రాజు, వరంగల్, జనగామ, మహబూబాబాద్ జిల్లా మార్కెటింగ్ అధికారులు ప్రసాద్‌రావు, నరేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు. కాగా, కేసముద్రం మార్కెట్ సూపర్‌వైజర్‌గా పనిచేసిన రాజేందర్ పదోన్నతిపై వరంగల్ మార్కెట్‌కు వెళ్తున్న సందర్భంగా ఆయనను మార్కెట్ మాజీ చైర్మన్ మర్రి నారాయణరావు, చాంబర్‌ఆఫ్‌కామర్స్, మార్కెట్ అధికారులు, దడువాయి సంఘం నాయకులు సన్మానించారు.

లైంగిక దాడి ఘటనలో నేరస్తుడికి 20 ఏళ్ల జైలు

వరంగల్ లీగల్ : బాలికపై లైంగికదాడికి పాల్పడిన కామాంధుడికి హనుమకొండ రెండో అదనపు జిల్లా కోర్టు జడ్జి అపర్ణ.. 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ బుధవారం సంచలన తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం కానిపర్తి గ్రామానికి చెందిన దంపతులు కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నారు. రోజుమాదిరిగానే 2018, జూలై 22న తమ 8 సంవత్సరాల వయసు గల మూడో తరగతి చదువుతున్న కూతురును ఇంటి వద్ద వదిలి కూలీ పనికి వెళ్లారు. పక్కింట్లో ఉండే సమీప బంధువు కొడిగుట్టి పెద్దస్వామి.. పండు ఇస్తానని ఆడుకుంటున్న బాలికను పిలువగా ఆ చిన్నారి నమ్మకంతో వెళ్లింది. దీంతో ఆ కామాంధుడు అభంశుభం తెలియని చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. రాత్రి ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు బాలిక విషయం చెప్పింది. దీంతో వెంటనే తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోక్సో కేసు నమోదు చేశారు. అనంతరం పెద్దస్వామిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. విచారణలో నేరం రుజువుకావడంతో నేరస్తుడికి 20 సంవత్సరాల జైలు, రూ.10 వేల జరిమానా విధిస్తూ జడ్జి అపర్ణ తీర్పు వెల్లడించారు. పరిహారం కింద బాధితురాలి కుటుంబానికి రూ. 2 లక్షలు చెల్లించాలని జడ్జి.. ప్రభుత్వాన్ని ఆదేశించింది.

సేవాలాల్‌ను దేవుడిలా కొలుస్తున్నాం..

● మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి


సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

మరిపెడ: సంత్ సేవాలాల్‌ను దేవుడిలా కొలుస్తున్నామని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మరిపెడ మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ ఆధ్యక్షతన సేవాలాల్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి హాజరై మాట్లాడారు. సేవాలాల్ చేసిన సేవలు గుర్తు పెట్టుకొని.. కాంగ్రెస్ ప్రభుత్వం జయంతి వేడుకలను నిర్వహిస్తుందన్నారు. లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చింది ఇందిరమ్మ అని గుర్తు చేశారు. ఆరు గ్యారంటీల విషయంలో ప్రతిపక్షాలు రాద్ధాంతం చేయడం సిగ్గు చేటన్నారు. అన్ని అమలు చేస్తామన్నారు. ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్‌ను ప్రారంభించామన్నారు. మరో రెండు పథకాలు త్వరలో ప్రారంభిచడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. 48గంటల్లో రెండు, 75రోజుల్లో మొత్తం నాలుగు గ్యారంటీలు ప్రారంభించిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికి దక్కిందన్నారు. నిరుద్యోగులకు న్యాయం చేస్తామన్నారు. ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు తేజావత్ బెల్లయ్యనాయక్, మాజీ ఎంపీ బలరాంనాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరారెడ్డి, గందసిరి అంబరీష తదితరులు పాల్గొన్నారు.

తాళాలు వేసి ఉన్న ఇళ్లే టార్గెట్..

● దొంగల ముఠా అరెస్ట్
● వివరాలు వెల్లడించిన ఏసీపీ


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ సతీష్‌బాబు

వరంగల్ : తాళాలు వేసి ఉన్న ఇళ్లే టార్గెట్‌గా దోపిడీలకు పాల్పడుతున్న ముఠాను సీసీఎస్, ఏనుమాముల పోలీసులు అరెస్టు చేసినట్లు మామునూరు ఏసీపీ సతీష్‌కుమార్ తెలిపారు. బుధవారం ఏనుమాముల పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి రూరల్ మండలం ధవళేశ్వరంలోని సంజీవ్‌నగర్‌కాలనీకి చెందిన రాపోలు రామకృష్ణ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోరికొత్తపల్లి గ్రామానికి చెందిన పప్పుల సంపత్, కేతిరి కిరణ్ స్నేహితులు. జల్సాలకు అలవాటు పడిన వీరు సులువుగా డబ్బు సంపాదించాలనుకున్నారు. అనుకున్నదే తడవుగా చోరీలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో పరకాల ముదిరాజ్‌కాలనీలో ఈనెల 4వతేదీన తాళం వేసి ఉన్న ఇంట్లోకి చోరీకి పాల్పడ్డాడు. గోల్డ్ బిస్కెట్, జత కమ్మలు, రెండు గాజులు, సత్యనారాయణస్వామి, గణపతి లక్ష్మీ, సరస్వతి అమ్మవార్ల వెండి ప్రతిమలతో పాటు రూ.10వేలు ఎత్తుకెళ్లి సంపత్ దగ్గర దాచారు. అనంతరం సుమారు వారం రోజుల తరువాత పరకాలలోని ఆదర్శనగర్‌లో మరో ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. ఈ ఘటనలో వెండి ఆభరణాలను అపహరించి కేతిరి కిరణ్ దగ్గర దాచారు. అలాగే, ఏనుమాముల శివారులోని ఆరెపల్లిలో బుర్ర వసంతరావు ఇంట్లో 18వ తేదీన చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనలో రెండు తులాలు గల బంగారం , గోల్డ్‌బిస్కెట్, రూ.1500 నగదు అపహరించి గోరుకొత్తపల్లికి చేరుకున్నారు. ఈ క్రమంలో చోరీ చేసిన వస్తువులను విక్రయించడానికి వరంగల్‌కు వస్తున్న క్రమంలో ఏనుమాములలోని కారల్‌మార్క్స్ నగర్ దగ్గర వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులకు పట్టుబడ్డారు. దీంతో వారి వద్ద నుంచి చోరీ సొత్తును రికవరీ చేసినట్లు ఏసీపీ తెలిపారు. కాగా, దొంగల ముఠాను పట్టుకున్న సీఐలు పి.కిషన్, శంకర్ నాయక్, ఎస్సైలు పోగుల శ్రీకాంత్, సంపత్‌కుమార్, సిబ్బంది మున్నా, వేణు, రవి, వెంకన్న, కిరణ్, మహేందర్, విజయ్, యుగంధర్, రవీందర్‌ను ఏసీపీ సతీష్‌బాబు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


గణపతి (ఫైల్)

గూడూరు : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి మండలంలోని బొల్లెపల్లి శివారులో జరిగింది. ఎస్సై సీహెచ్. నగేష్ కథనం ప్రకారం బొల్లెపల్లికి చెందిన బానోత్ గణపతి (40), సమీప బంచరాయితండాకు చెందిన బానోతు నరేష్, రమేష్ బైక్‌పై గూడూరు బయలుదేరారు. ఈ క్రమంలో గ్రామ శివారు దాటగానే బానోతు నరేష్ బైక్‌ను అతివేగంగా నడిపి పక్కనే ఉన్న మట్టికుప్పను ఢీకొన్నాడు. ఈ ఘటనలో గణపతికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులకు గూడూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై మృతుడు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై నగేష్ బుధవారం తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT & LAND FOR SALE

■ 200 Sq.Yards Plot for Sale in Shivunipally, Ghanpur and 5 Acres Land for Sale in Dharmasagar. Cont: 9177638443. [W-1200983]

SERVICES

FINANCE

■ హౌసింగ్, బిజినెస్, పర్సనల్, మార్టిగేజ్ & ఉద్యోగస్తులందరికి పర్సనల్ రుణాలు ఏ బ్యాంకులలో అయినా ఇప్పించబడును & IT Returns, GST License చేయబడను. పద్మావతి ఫైనాన్స్ WGL. 9618767116. [W-1200989]

BUSINESS OFFER

■ యువతీ, యువకులకు ఉపాధి మీ గ్రామంలో ఉంటూ తక్కువ పెట్టుబడితో 15 రకాల వెజ్ 5 రకాల నాన్ వెజ్ పచ్చళ్ళ వ్యాపారం చేస్తూ నెలకు 15 నుండి 30 వేల వరకు ఆదాయం పొందే అవకాశం. సంప్ర॥ 8143909459. [W-1220993]

■ ద్వారక ఎంటర్‌ప్రైజెస్: పేపర్‌ప్లేట్స్ & LED మిషన్స్‌పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం. ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం ✆ 9310515624, 8800496710 [G-1438]

FURNITURE FOR SALE

■ G.P. Mess హోటల్ ఫర్నీచర్ అమ్మబడును. ఎర్రగట్టు గుట్ట. సంప్ర॥ 9705864281. [M-10594]

WANTED

■ శ్రీ బాలాజీ సోలార్ ఎనర్జీస్‌లో పనిచేయుటకు సోలార్ టెక్నీషియన్స్–5, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్–5, అకౌంటెంట్–1, గ్రాఫిక్ డిజైనర్–1, రిసెప్షనిస్ట్–1, టెలికాలర్స్–3 కావలెను. సంప్ర॥ చింతల నరసింహులు కాంప్లెక్స్ పైన, లష్కర్‌బజార్, HNK. Cell: 9515954923, 8885003401. [W-1200867]

■ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. జీతం: 13000–16000. సంప్ర॥ 9000463426. [W-1220896]

■ Wanted PRO's for Degree and Junior College Admissions (20 years Experience) Cont. 8121554649, 9391660036 [WA-13916]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/– రూ॥ అదనపు లైను 60/– రూ॥ మాత్రమే 5% GST అదనము

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడి సూపర్‌వైజర్స్, నర్సులు, ఆయాలు, వాచ్‌మెన్‌లు, భార్యాభర్తలు కావలెను. ఫోన్: 9391036931, 9246585901. [HA-13601]

■ మార్చి మొదటి వారంలో అమెరికా వెళుతున్న మాకు ఇంటి, వంట పనులు చేయుటకు ఆడమనిషి కావలెను. అమెరికా విజిటింగ్ వీసా కలిగిన వారు మాత్రమే సంప్రదించగలరు. ✆ 92904 15199 [B-790486]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 9059683584. [M-1233860]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం జీ: 18k ఫోన్: 9640258899 / 9640468899 [H-793696]

మీ చిన్నారి పుట్టినరోజు శుభాకాంక్షలను ఇప్పుడు సాక్షి ద్వారా తెలియజేయండి కేవలం రూ.500/– మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.